క్లుప్తంగా

పటేల్ ఆశయ సాధనకు కృషి



పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టరేట్లో సర్దార్ వల్లబాయి పటేల్ జయంతి జరిగింది. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, ఏవో ఈశ్వరరావు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని పటేల్‌కు ఘన నివాళి అర్పించారు. భారత ప్రథమ హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటం వద్ద కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ భగవాన్ మాట్లాడారు. అవినీతి వ్యతిరేక సందేశాలు ప్రజలకు చేరేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించి, అప్రమత్తంగా ఉండటం ద్వారా సుసంపన్న భారత్ సాధించవచ్చన్నారు. ఆన్‌లైన్ పద్ధతులను విస్తృతంగా వాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హెచ్‌ఆర్ మేనేజర్ జి.భారతి, డాక్టర్ పి.కె. జయలక్ష్మి పాల్గొన్నారు

కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఒక పేద మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స చేయడంతో రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన 42 సంవత్సరాల పి.లక్ష్మి అనే మహిళ తలనొప్పి, వాంతులతో బాధపడుతూ గత నెల 14న కేజీహెచ్ న్యూరో ఓపీలో చూపించుకుంది. ప్రాథమిక పరీక్షలు చేసి న్యూరో సర్జరీ వార్డులో చేర్చారు. ఆమెకు ట్యూమర్ ఉన్నట్లు తేలింది. గతంలో కూడా ఈమెకు ఇదే సమస్య రావడంతో 2021లో కేజీహెచ్‌లో ఆపరేషన్ చేశారు. అయితే అప్పుడు కొంత భాగమే తొలగించారు. మరొక సారి శస్త్ర చికిత్సలో పూర్తిగా తొలగిస్తామని అప్పట్లో వైద్యులు చెప్పారు. ఈ ట్యూమర్ పెరిగి ఇప్పుడు పెద్దదై బ్రెయిన్‌లో 3వ వంతు పెరిగింది. ఇది క్యాన్సర్ కాదని, బ్రెయిన్ ట్యూమర్ అని వైద్యులు వివరించారు. గత నెల 22న శస్త్ర చికిత్స చేసి ట్యూమర్‌ను పూర్తిగా తొలగించారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమ జిత్ రే ఆధ్వర్యంలో ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి పర్యవేక్షణలో 8 గంటల పాటు శస్త్ర చికిత్స చేసి పూర్తిగా తొలగించారు. శుక్రవారం రోగిని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద పరామర్శించారు.

శివ పూజకు వేళాయె

దీపావళి పర్వదినం ముగియగానే కార్తీక మాసం ప్రారంభం అవుతుంది. అయితే నవంబర్ 1 సూర్యోదయ సమయాన అమావాస్య ఘడియలు ఉండటంతో నవంబర్ 2 నుండి కార్తీక స్నానాలు ప్రారంభించాలని పండితులు తెలిపారు. కార్తీకమాసంలో శివకేశవుల భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగుతాయి. ఈ మాసంలో శివాలయంలో దీపం వెలిగిస్తే జన్మజన్మ పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- శివాలయాలకు ఆధ్యాత్మిక శోభ



సూర్యాబాగ్‌లో గల శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం



విశేష అలంకరణలో పంచముఖ శివలింగం



డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ గణపతి భవానీ శంకర ఆలయం



టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం

అల్లిపురం: నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అస్సాం గార్డెన్స్, శ్రీ శివరామకృష్ణ దేవాలయంతో పాటు నియోజకవర్గంలో సూర్యాబాగ్ శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం, వన్‌టౌన్ భీమలింగేశ్వర స్వామి దేవస్థానం, డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ గణపతి భవానీ శంకర ఆలయం, రామలింగేశ్వరస్వామి దేవాలయం, మురళీధర వీధిలోని శ్రీ పంచముఖ దక్షిణామూర్తేశ్వరస్వామి ఆలయం, బౌడారా రోడ్డులో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ శివరామకృష్ణ దేవస్థానం ఈవో రమాబాయి తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్తీక మాసం నెల రోజులు తెల్లవారు జామున 5.30 గంటలకు మొదటి పూజ ఉంటుందన్నారు. 31, నవంబర్ 4,11,18 25 తేదీల్లో నాలుగు సోమవారాలు, 5వ తేదీన నాగుల చవితి, 12వ తేదీన శుక్ల ఏకాదశి, 15వ తేదీన కార్తీక పౌర్ణమి, 2వ తేదీన పోలి పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 29వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్తీక మాసం పవిత్రమైనది..

ఏడాదిలో 12 నెలల్లో కార్తీక మాసం ప్రత్యేకమైంది. ఈ మాసం శివ, కేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైనది. కార్తీకంలో శివకేశవులిద్దరిని పూజించిన వారికి అన్నీ శుభాలే జరుగుతాయి. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో ఉపవాసాలు చేసిన వారికి మంచి జరుగుతుంది.

– భార్గవ శర్మ, ప్రధాన అర్చకుడు, శివరామకృష్ణ దేవస్థానం

కార్తీక మాసోత్సవాలకు శ్రీకారం



శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు



సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆకాశదీప కార్యక్రమంలో పాల్గొన్న ఏఈవో తిరుమలేశ్వరరావు

మహారాణిపేట: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆకాశదీప కార్యక్రమం చేపట్టారు. అమావాస్య ఘడియలు వీడడం, కార్తీక మాసం ప్రారంభం కావడం, పాడ్యమి మొదలు కావడంతో శివాలయాల్లో ఆకాశ దీపాలు వెలిగించి కార్తీక మాసానికి శ్రీకారం చుట్టారు. ధ్వజస్తంభాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాలు వెలిగించారు. హరహర మహాదేవ శంభో శంకర, ఓం నమశ్శివాయ అంటూ భక్తులు చేసిన శివనామ స్మరణ మధ్య ఆకాశ దీపాలు వెలిగించి స్తంభాలకు వేలాడదీశారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన ఆకాశదీప వేడుకల్లో ఆలయ మేనేజర్ అడపా దేవుళ్లు, ఉద్యోగులు సత్యనారాయణ, రామారావు, ఆలయ అర్చకులు బాదంపూడి సదాశివ పాల్గొన్నారు. పాండురంగ స్వామి ఆలయంతో పాటు నగరంలోని అన్ని శివాలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కార్తీక మాసం పాటిస్తారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో..

డాబాగార్డెన్స్: కార్తీకమాసం సందర్భంగా కనక మహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం ఆకాశదీప కార్యక్రమం నిర్వహించారు. అలాగే అమ్మవారి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడా ఆకాశదీప కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

‘గంగ’కు న్యాయం చేయాలని వినతి



సీపీని కలిసిన సిటు ప్రతినిధి మణి తదితరులు

సీతమ్మధార: సీతమ్మధారలో గల ఆక్సిజన్ టవర్స్‌లో ఇంటి పని చేస్తున్న గంగకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మణి కోరారు. ఈ మేరకు ఆమె నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ క్రైమ్ ఎస్ఐ నరవ జగదీష్, మరో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్‌లోనే ఆమెను కొట్టడం వల్ల ఆమె కాలు విరిగిపోయిందని గుర్తు చేశారు. చట్టవ్యతిరేకంగా ప్రవర్తించిన పోలీసులను తక్షణం సస్పెండ్ చేయాలని సీఐటీయూ తరపున డిమాండ్ చేశారు. అలాగే ఇంటి ఓనర్ ప్రియాంక వ్యవహార శైలిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరుతున్నాం అన్నారు. సీపీని కలిసిన వారిలో బాధితురాలు గంగతో పాటు పలువురు సీఐటీయూ ప్రతినిధులు కూడా ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్పీ కృష్ణవేణి కుటుంబానికి నగదు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో ఆర్పీగా సేవలందించిన కృష్ణవేణి ఆకాల మృతి చెందడంతో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో శుక్రవారం ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ పరామర్శించారు. కృష్ణవేణి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణవేని అంత్యక్రియలకు శ్రీధర్ రూ. 10 వేల నగదు అందజేశారు. ఆమె మృతి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, శ్యాం సుందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ విజృంభణ..

జోన్–5 పరిధి పలు ప్రాంతాల్లో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో డెంగ్యూ మరణాలు సంభవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మృతి చెందిన ఆర్పీ కృష్ణవేణి డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారులను వివరణ కోరగా సమాధానం దాట వేశారు. ఇప్పటికైనా జ్ఞానాపురంలోని పలు వీధుల్లో ఫాగింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం దుకాణం తొలగింపునకు అనుమతి



నిరసన చేపట్టిన చోటే దీపాలు వెలిగించిన మహిళలు

అల్లిపురం: భూపేష్‌నగర్ వద్ద మద్యం దుకాణం వద్దంటూ స్థానికులు చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇవ్వటంతో ఆందోళనకారులు అక్కడే దీపావళి వేడుకలు నిర్వహించుకున్నారని కులవివక్ష పోరాట సమితి నాయకుడు వై.రాజు తెలిపారు. గురువారం నుంచి నిరసనను విరమించుకుంటున్నట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోనట్లయితే మళ్లీ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానికులు మాట్లాడుతూ ప్రజలు కలిసి ఉంటే సాధించలేనిది ఏమీ లేదని నిరూపించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.వరలక్ష్మి, కె. మణి, సీఐటీయూ నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రమౌళి, చంద్రశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల సన్నిధిలో దీపావళి వేడుకలు



గౌరీపార్వతుల సేవలో కార్యవర్గ సభ్యులు



దీపావళి పండగను ఆస్వాదిస్తున్న వృద్ధులు

అల్లిపురం: వేంకటేశ్వరమెట్టపై వెలసిన శ్రీ గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో దీపావళి వేడుకలు నిర్వహించారు. మండపాన్ని దీపాలతో తీర్చిదిద్ది అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఏక హారతి మొదలుకొని నక్షత్ర హారతి వరకు భక్తిశ్రద్ధలతో హారతి సేవ నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రంథాలయం కార్యవర్గ సభ్యులు పాలమరశెట్టి శ్యామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీను, కార్యవర్గ సభ్యులు, శివ భక్తులు పీల వెంకట అప్పలనాయుడు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో..

డాబాగార్డెన్స్: దీపావళిని వివేకానంద సంస్థలో ఘనంగా జరుపుకున్నారు. సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు సాంప్రదాయ రీతిన నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ఆశ్రమంలో ఉండే వారికి ఎవరూ లేరనే బాధ కలగకుండా, ప్రతి పండగను ఆనందంగా వారి మధ్య జరుపుతున్నామని తెలిపారు.

మహిళా కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం



వల్లబాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ ఐక్యతా దినోత్సవం జరిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పాల్గొని పటేల్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సమగ్రత, సమైక్యతకు భంగం కలిగించకుండా, తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ దేశ పురోభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అనుపమ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అరుణ పద్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అనురాధ, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ గీతాంజలి ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ తదితరులు

డాబాగార్డెన్స్: ఈ నెల 19 నుంచి 21వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సం నిర్వాహక ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విశాఖ బాలోత్సవం స్థానిక సెయింట్ ఆంథోనీ ప్రైమరీ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాల సెట్లు అందజేశామన్నారు. ఈ నెల 9లోగా బాలోత్సవ కేంద్రంలో ఎంట్రీలు అందజేయాలని స్కూళ్ల యాజమాన్యాలను కోరినట్టు తెలిపారు. బాలోత్సవం విజయవంతం చేసేందుకు జీవీఎంసీ కమిషనర్ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశాఖ బాలోత్సవం అధ్యక్షుడు పి. రఘు, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యనారాయణ, పి. లచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమిద్దాం



ఐక్యత చాటుతున్న వివిధ సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జే నాయుడు అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కేఎస్ చలం, డాక్టర్ కొల్లా రాజమోహన్, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు పాల్గొని మాట్లాడారు. 1966 నవంబర్ ఒకటిన విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం ఉవ్వెత్తున సాగిందన్నారు. 32 మంది విద్యార్థులు, యువకుల బలిదానంతో విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించుకున్నామన్నారు. బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దక్షిణ కొరియా పోస్కో కంపెనీతో ఒప్పందం చేసిందని తెలిపారు. విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో ఎందుకు విలీనం చేయడం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయించడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఎ. అశోక్ (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి), రామన్న (డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి), భాను (పీడీఎస్‌వో), హరీష్‌కుమార్ (ఏఐడీఎస్‌వో) మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు, తెలుగు ప్రజలంతా పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నారని, నేడు పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నెల రోజుల్లో విశాఖ స్టీల్ శతశాతం అమ్మకం నిర్ణయాన్ని విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువత ఆందోళన తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్నకుమార్, రాము, యూఎస్ఎన్ రాజు, సంతోష్, పల్లవి, సౌమ్య, రామ్మోహన్, నాగరాజు, అభిలాష్, విశ్వనాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

తండ్రి చెంతకు కుమార్తె.. ఆమె పిల్లలు



నారాయణరావుకి కుమార్తె, ఆమె పిల్లలను అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: విజయలక్ష్మి అనే మహిళ భర్త, పిల్లలతో తగరపువలసలో నివాసం ఉంటోంది. ఈమె భర్త తాడుడికి బానిస అయ్యాడు. నిత్యం మద్యం తాగి భార్యను హింసించేవాడు. ఈ నేపథ్యంలో భర్త పెట్టే బాధలు భరించలేని విజయలక్ష్మి పిల్లలతో పాటు విశాఖ వచ్చేసి రైల్వేస్టేషన్‌లో ఉంటోంది. స్టేషన్‌లో దిశ పోలీసులు ఈ మహిళను గమనించి ఏయూటీడీకి సమాచారం ఇచ్చారు. దీంతో సంస్థ సిబ్బంది ఆమెను, పిల్లలను ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. తర్వాత ఏయూటీడీ ద్వారా సమాచారం తెలుసుకున్న ఆమె తండ్రి నారాయణరావు వసతి గృహానికి రావడంతో భీమిలి పోలీసుల సమక్షంలో విజయలక్ష్మి, ఆమె పిల్లలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

స్పందించారు.. పరిష్కరించారు



సోల్జర్ పేటలో పరిస్థితి




సాక్షి కథనం అనంతరం

సాక్షి ఎఫెక్ట్..

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే సారూ.. ఓసారి ఇటు చూడండంటూ ‘సాక్షి’ ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పాతనగరం 39వ వార్డు పరిధి సోల్జర్‌పేటలో రిచర్డ్స్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో చిన్న పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పక్షం రోజుల కిందట డ్రైనేజీ పనుల కోసం తవ్వి వదిలేశారు. దీంతో చిన్న పిల్లలు, రాత్రి వేళల్లో స్థానికులు, మందుబాబులు పడిపోతున్నారు. స్థానిక కార్పొరేటర్ స్పందించకపోవడంతో.. ఎమ్మెల్యే సారూ.. ఓసారి ఇటు చూడండి.. అంటూ సాక్షి కథనాన్ని ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి చిన్నపిల్లలు పడిపోకుండా, స్థానికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. భూగర్భ డ్రైనేజీ పనుల గోతులు పూడ్చారు.

పోర్టు ఆస్పత్రిని యాజమాన్యమే నిర్వహించాలి

- సీఐటీయూ కార్యదర్శి జగన్



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి బి. జగన్ డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలనే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రతిపాదనను విరమించుకుని, పోర్టు అథారిటీ సొంత నిధులతోనే ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. ఈ ప్రతిపాదన లోక్‌సభలో చేసిన నాటి నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ప్రైవేటు వారు వస్తే లోపలికి అడుగుపెట్టబోనివ్వమన్నారు. సీఐటీయూ నాయకులు బి. లక్ష్మణరావు, కె. సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శంకర్రావు, గణేష్, రాము, నరసింహమూర్తి పాల్గొన్నారు.

పోర్టులో ఘనంగా ఏక్తా దివస్



ఏక్తా దివస్ వేడుకల్లో పాల్గొన్న పోర్టు అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: భారతరత్న సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఏక్తా దినోత్సవం) వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోర్టు సాంబమూర్తి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పోర్టులు, నౌకాశ్రయాలు, నీటి మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే, ఇతర అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏక్తా ప్రమాణం చేయించారు.